
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

ఆదివారం 14 జనవరి 2024

వెలుగు ఏపీఎం, ముగ్గురు సీసీలు సస్పెన్షన్

- నకిలీ స్వయం సహాయక సంఘాల పేరుతో బ్యాంకు రుణాలు స్వాహా
- విచారణలో నిర్ధారణ కావడంతో డీఆర్‌డీఏ అధికారులు చర్యలు

· 6లో

ఎత్తిపోతలపై నిర్లక్ష్యం... గిరి రైతులకు శాపం

- ఏజెన్సీలో పంట పొలాలకు సాగు నీరందని పరిస్థితి
- పథకాలకు మరమ్మతులు చేపట్టాలని రైతుల వేడుకోలు



హుకుంపేట మారెలలో వినియోగానికి దూరమైన ఎత్తిపోతల పథకం

పడకేసిన సాగునీటి పథకాలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని ఎత్తిపోతల పథకాలపై చాలా కాలంగా నిర్లక్ష్యం కొనసాగుతున్నది. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాలు వినియోగానికి దూరంగా ఉంటున్నాయి. దీని వల్ల ఆయకట్టు కింద వున్న పంట పొలాలకు సాగునీరందని పరిస్థితులు కొనసాగుతున్నాయి.

కేవలం వర్షాధారంగా మాత్రమే పంటల సాగు చేస్తున్న గిరిజన రైతులకు ఎత్తిపోతల పథకాల ద్వారా అవసరమైన సాగునీటి సదుపాయాలు కల్పించాలని 1996లో అప్పటి ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా ఏజెన్సీలో



పాడేరు మండలం రాయిగెడ్డలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం

పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో 22 వరకు ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ఆయా పథకాల కింద వున్న ఆయకట్టు భూములకు సాగునీరు అందించడం ద్వారా పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ కొన్నాళ్ల తరువాత అధికారులు, గిరిజన రైతులు సైతం వాటిపై ఆసక్తి కనబరచకపోవడంతోపాటు ఒక్కొక్కటిగా ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. కాగా గతంలో పాడేరు కేంద్రంగా ఉండే ఆంధ్రప్రదేశ్ మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని రెండు దశాబ్దాల క్రితం ఎత్తేశారు. దీంతో మన్యానికి మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సేవలు దూరమయ్యాయి. అనంతరం ఎత్తిపోతల పథకాల వైపు కన్నెత్తి చూసే వారు కరువయ్యారు. దీంతో ఏజెన్సీలో అరకొరగా పని చేసే హుకుంపేట మండలం మారెల, దిగుడుపుట్టు, పాడేరు మండలం ఉబ్బేటిపుట్టు, సేరిబయలు, రాయిగెడ్డ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు సైతం కొన్నాళ్లుగా పూర్తిగా పడకేశాయి. దీని వల్ల ఆయా పథకాల కింద ఆయకట్టులో వున్న పంట భూములకు సాగునీరు అందని దుస్థితి కొనసాగుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏజెన్సీలో ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతాలు రద్దీ

సంక్రాంతి సెలవులు కావడంతో పోటెత్తిన పర్యాటకులు

- బొర్రా గుహలు నుంచి లంబసింగి వరకు సందడి
- కోలాహలంగా మన్యంలోని సందర్శనీయ ప్రాంతాలు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

పాడేరురూరల్, జనవరి 13: **మన్యంలోని పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో శనివారం రద్దీగా కనిపించాయి. ఏజెన్సీలో ఎక్కడ చూసినా సందర్శకులే దర్శనమిచ్చారు. సంక్రాంతి సందర్భంగా వరుస సెలవులు రావడంతో అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు ఒకటే సందడి నెలకొంది.**

పాడేరు మండలంలోని వంజంగి మేఘాల కొండకు పర్యాటకులు శనివారం పోటెత్తారు. వేలాది మంది పర్యాటకులు శుక్రవారం సాయంత్రానికే పాడేరు, వంజంగి ప్రాంతాలకు చేరుకొని రాత్రి బస చేశారు. శనివారం ఉదయం 5 గంటల సమయానికి పర్వతంపైకి చేరుకొని పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాలను, సూర్యోదయ సమయంలో లేలేత కిరణాలను తిలకించి పరవశించారు. వంజంగి వచ్చిన పర్యాటకులు స్థానిక మోదకొండమ్మను దర్శించుకొనేందుకు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

బొర్రా, అరకులోయలో..

అరకులోయ: సంక్రాంతి సెలవులు కావడంతో ప్రముఖ పర్యాటక కేంద్రాలు కిటకిటలాడాయి. అనంతగిరి మండలంలోని బొర్రాగుహలు, అరకులోని పద్మాపురం గా



బొర్రాగుహలు వద్ద పర్యాటకులు

ర్డెన్, గిరిజన మ్యూజియం, ఘాట్ రోడ్డులో బీసుపురం, గాలికొండ, డముకు వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి కనిపించింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు రావడంతో పలు ప్రాంతాలు రద్దీగా మారాయి. అలాగే మాడగడ సన్‌రైజ్ పాయింట్ వద్ద తెల్లవారుజాము నుంచే పర్యాటకుల సందడి కనిపించింది. అక్కడి మంచు అందాలు, సూర్యోదయ సోయగాన్ని తిలకించారు.

లంబసింగి వద్ద..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. వీకెండ్, సంక్రాంతి సెలవులు కలిసి రావడంతో పర్యాటకులు లంబసింగికి క్యూ కడుతున్నారు. శనివారం లంబసింగికి వేల సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. కొంత మంది పర్యాటకులు ముందు రోజే లంబసింగికి చేరుకోగా, ఎక్కువ మంది ఉదయం ఐదు గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. దీంతో ఉదయం నుంచి లంబసింగి, చెరువులవేనం, తాజంగి పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. చెరువులవేనంలో జాతర వాతావరణం కనిపించింది. ఆకాశాన్ని తాకుతూ పయనించే మంచు అందాలను ప్రత్యక్షంగా ... మిగతా 6వ పేజీలో

చెరువులవేనంలో సందడి



భారీగా గంజాయి స్వాధీనం

- 830 కిలోల గంజాయితో పాటు రెండు వాహనాలు సీజ్
- ఏడుగురు నిందితుల అరెస్టు



630 కిలోల గంజాయి, నిందితులతో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది

పెదబయలు, జనవరి 13: మండలంలో భారీ ఎత్తున గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూడకోట పంచాయతీ పాత రూడకోట జంక్షన్‌లో శుక్రవారం రాత్రి 200 కిలోలు, శనివారం వేకువజామున 630 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రూడకోట పంచాయతీ పాత రూడకోట జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ మార్గంలో వస్తున్న నంబరు ప్లేటు లేని వ్యాన్‌ని ఆపి తనిఖీ చేసి బస్తాల్లో 200 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వ్యాన్‌లోని బిహార్ రాష్ట్రం సారమ్ జిల్లాకు చెందిన విక్కీ, జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లాకు చెందిన అక్షయ్‌కుమార్, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన పాంగి ప్రసన్‌జిత్‌లను అరెస్టు చేసి వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అలాగే శనివారం తెల్లవారుజామున అదే మార్గంలో వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, అందులో 630 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వ్యాన్‌లోని అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం బాబుసాల పంచాయితీ కాంద్రంగివలస గ్రామానికి చెందిన మఠం రాజేంద్రప్రసాద్, ఒడిశా రాష్ట్రం పొట్టంగి మండలానికి చెందిన గోపాల్‌గుంట, జైపూర్‌కు చెందిన షేక్ ఆజాద్, లబహరిజన్‌లను అరెస్టు చేసి గంజాయితో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.



200 కిలోల గంజాయి, నిందితులతో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది

ప్రాణం తీసిన మనస్పర్థలు

- భర్తకు మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చిన భార్య
- తన కుమారుడిని కోడలే హత్య చేసిందని పోలీసులకు తల్లి ఫిర్యాదు

· 7లో



బరుకు గోవింద (ఫైల్ ఫొటో)

ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహ జ్వాల



అరకులోయ అంబేద్కర్ విగ్రహం వద్ద భోగి మంటలో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరుకుంది. వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తమపై ఎస్మా ప్రయోగించడం, షోకాజ్ నోటీసులను ఇవ్వడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనలు చేస్తున్నారు. అరకులోయ అంబేద్కర్ విగ్రహం వద్ద భోగి మంట వేసి అందులో ఎస్మా ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. చింతపల్లిలో ఓటరు కార్డులను ప్రదర్శిస్తూ ఓటుతోనే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గూడెంకొత్తవీధిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రాన్ని దహనం చేశారు.

- వార్త 6వ పేజీలో..

కృష్ణాపురం పైన్ తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు

రూ.25 లక్షలతో అటవీశాఖ పనులు

- అందుబాటులోకి రానున్న టెంట్లు, రెస్టారెంట్

చింతపల్లి, జనవరి 13:

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలోని కృష్ణాపురం పైన్ తోటల్లో అటవీశాఖ అధికారులు ఎకో టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా రూ.25 లక్షల తొలి దశ నిధులతో పనులు చేపడుతున్నారు.

కృష్ణాపురం పైన్ తోటలు సాధారణంగానే పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే పర్యాటకులు తోటల వద్ద ఫొటోలు తీసుకుని కొంత సమయం విశ్రాంతి తీసుకుని వెళుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన అటవీశాఖ ఉన్నతాధికారులు కృష్ణాపురం పైన్ తోటల వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టు రూపకల్ప



కృష్ణాపురం పైన్ తోటల వద్ద ఎకో టూరిజం ప్రధాన ద్వారం పనులు



ఎకో టూరిజంలో నిర్మాణంలో ఉన్న అంతర్గత రహదారులు

నకు శ్రీకారం చుట్టారు. కృష్ణాపురం పైన్ తోటలు లంబసింగికి నాలుగు కిలోమీటర్ల దూరంలో, చింతపల్లి, పాడేరు-లంబసింగి మార్గంలో రహదారికి ఆనుకుని వున్నాయి. లంబసింగి, కొత్తపల్లి జలపాతాలు, పాడేరు, అరకు ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులు ఈ మార్గంలోనే ప్రయాణించాలి. దీంతో కృష్ణాపురం పైన్ తోటలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే సందర్శకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఎకో టూరిజం కోసం పైన్ తోటల్లో 15 ఎకరాలు కేటాయించారు.

అందుబాటులోకి రానున్న సదుపాయాలు

కృష్ణాపురం ఎకో టూరిజం ప్రాజెక్టులో ప్రాథమికంగా పర్యాటకులకు అవసరమైన కనీస సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అటవీశాఖ అధికారులు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అంతర్గత రహదారులు, ఆర్చ్‌ను ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, రెస్టారెంట్, రన్నింగ్ వాటర్, కాఫీ హౌస్ నిర్మాణాలకు టెండర్లు పిలిచారు. మరో పదిహేను రోజుల్లో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద తొలి విడతగా పర్యాటకులు బస చేసేందుకు 15 సింగల్, 10 డబుల్ టెంట్లు ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్తులో ట్రీహట్స్, వ్యూపాయింట్, శాశ్వత గదులు ... మిగతా 6వ పేజీలో



లంబసింగిలో కురుస్తున్న మంచు

పది గంటలైనా తెలవారదే!

- కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగినా తగ్గని పొగమంచు
- మన్యంలో కొనసాగుతున్న చలి తీవ్రత

పాడేరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పాడేరులో శనివారం ఉదయం పది గంటల వరకు మంచు తెరలు వీడలేదు. దాదాపు ఉదయం పది గంటలు దాటే వరకు పాడేరు, పరిసర ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కమ్మేసింది. గత రెండు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ పొగ మంచు ప్రభావం మాత్రం తగ్గకపోవడం విశేషం. వాస్తవానికి బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో గత నాలుగు రోజులుగా ఏజెన్సీలో పెద్దగా పొగమంచు కురవలేదు. ద్రోణి ప్రభావం తొలగిపోవడంతో శుక్రవారం నుంచి ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం పది గంటల వరకు పొగమంచు దట్టంగా ఆలముకుంటున్నది. శనివారం ఏజెన్సీలోని పాడేరు, చింతపల్లి, అరకులోయ ... మిగతా 6వ పేజీలో



ముంచంగిపుట్టులో చలి మంట కాగుతున్న దృశ్యం

అంగన్‌వాడీలకు బెదిరింపులు సరికాదు

- పండగ పూట ఆడపడుచులను రోడ్డుపై ఉంచడం దారుణం
- సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుందరరావు
- మన్యంలో కొనసాగుతున్న సమ్మె... నిరసన కార్యక్రమాలు



పాడేరు: శిబిరంలో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు



చింతపల్లిలో ఓటరు కార్డు చూపుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



గూడెంకొత్తవీధిలో సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రాన్ని దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

పాడేరు రూరల్/చింతపల్లి/అరకులోయ/గూడెంకొత్తవీధి, జనవరి 13: అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోగా తిరిగి బెదిరించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుందరరావు విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ 33 రోజులుగా సమ్మె బాట పట్టినప్పటికీ సీఎం జగన్, వైసీపీ మంత్రులకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం వారి రాక్షస పాలనకు నిదర్శనమన్నారు. మన్యంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం పలు మండలాల్లో వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాడేరు శిబిరంలో ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది ఆడపడుచులను సంక్రాంతి పండగ పూట వైసీపీ ప్రభుత్వం రోడ్డుపై ఉంచి నిరంకుశంగా వ్యవరించడం దారుణమన్నారు. అధికార దాహంతో అన్ని వర్గాల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హామీలను ఇచ్చిన జగన్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సరికదా వాటిని అమలు చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం, షోకాజు నోటీసులు ఇవ్వడం, బెదిరింపులకు పాల్పడటం దురదృష్టమన్నారు. బటన్ మాంత్రికుడు జగన్‌కు ఆడపడుచుల ఏడ్పులు, ఉసురు తగలక తప్పదన్నారు. ఈ శిబిరంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాయకులు భాగ్య, విజయ, ఇందిర, ఛాయాదేవి, సొలగం పార్వతి, బూసిన సత్యవతి, ఎస్.కాంతమ్మ, మఠం భవాని, శిరగం యశోద పాల్గొన్నారు. చింతపల్లిలో మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఓటరు కార్డు చూపిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షురాలు పెంటమ్మ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వస్తే ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు నెరవేరుతాయనే ఆశతో నాలుగున్నరేళ్లుగా ఎదురు చూశామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి కోసం ప్రతీ కార్యకర్త పని చేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం ప్రతినిధులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, యూనియన్ నాయకులు రాములమ్మ, అక్కమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, సత్యవతి, కుమారి, నీలమ్మ పాల్గొన్నారు. అరకులోయలో ఎస్మా, జీవో, నోటీసు ప్రతులను భోగి మంటల్లో వేసి అంగన్‌వాడీలు దహనం చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దురియా నాగమ్మ, వెంకటలక్ష్మి, కొర్రా లక్ష్మి, శారదా, సనీత, అరుణ, శాంతి, నిర్మల పాల్గొన్నారు. అలాగే గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణ చిత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే మరింత ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పోలీసుల వేధింపులపై ఆందోళన

ముంచంగిపుట్టు, జనవరి 13: కొంత కాలంగా వాహన డ్రైవర్లు, ప్రయాణికులను పోలీసులు వేధిస్తున్నారని గిరిజన సంఘం నాయకులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.త్రినాథ్ మాట్లాడుతూ మండలంలోని బుంగాపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు, వనుగుమ్మ తదితర పంచాయతీలకు పక్కా రహదారి సౌకర్యం ఉన్నా అటుగా ఆర్టీసీ బస్సులను అధికారులు నడపడం లేదన్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించడానికి ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడుతున్నారని చెప్పారు. అటుగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను నిబంధనలు పాటించడం లేదని, ప్రయాణికులు స్థాయికి మించి తిప్పుతున్నారన్న కారణాలను చూపుతూ పోలీసులు తరచూ స్టేషన్‌కి పిలిచి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. పోలీసులు వాహన డ్రైవర్లను నింబధనల పేరుతో ఇబ్బంది పెట్టరాదని, అవకాశం ఉంటే అధికారిక యంత్రాంగం పక్కా రహదారులు ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.నర్సయ, పి.రామదాసు, సీఐటీయూ నాయకుడు కె.శంకరరావు, వాహనదారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కృష్ణాపురం పైన్ తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు



ఎకో టూరిజం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ (ఫైల్)

... 5వ పేజీ తరువాయి

నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఏడాది పొడవునా సందర్శనకు అనువుగా..

ఎకో టూరిజం ప్రాజెక్టును పర్యాటకులు ఏడాది పొడవునా సందర్శించేందుకు అనువుగా తీర్చిదిద్దనున్నారు. సందర్శకుల వినోదం కోసం పలు రకాల క్రీడలు, ట్రెక్కింగ్ పాత్‌లు ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులు, ఈ ప్రాంత ప్రజలు వన భోజనాలు చేసేందుకు అనువుగా కొంత విస్తీర్ణం కేటాయించారు. ఈ ప్రాంతంలో పూల మొక్కలు, క్రోటాన్స్‌తో అలంకరించనున్నారు. ఓపెన్‌గా విందు, వినోద కార్యక్రమాలు ఇక్కడ నిర్వహించేందుకు అనువుగా అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎకో టూరిజంలో విశాలమైన పార్కింగ్‌తో పాటు పర్యాటకుల భద్రత కోసం 24 గంటలు టాస్క్‌ఫోర్సు ఉద్యోగులు విధుల్లో ఉంటారు.

దశలవారీగా అభివృద్ధి

- చిట్టపులి సూర్యనారాయణ,
డివిజినల్ ఫారెస్టు అధికారి, చింతపల్లి



డివిజన్ పరిధిలోని పర్యాటక ప్రాంతాలను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. తొలి విడతగా కృష్ణాపురం పైన్ తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నాం. భవిష్యత్తులో పర్యాటకులు అత్యధికంగా సందర్శించే రిజర్వుడ్ ఫారెస్టు ప్రాంతాలైన చెరువులవేనం, బోడకొండమ్మ దేవాలయం, యర్రవరం జలపాతం, జీకేవీధి దోనుగుమ్ముల జలపాతం, సీలేరు ఐస్‌గెడ్డ ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. ప్రధానంగా పర్యాటకులకు అడవులను పరిచయం చేయడంతో పాటు అటవీ సంపద సంరక్షణపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం.

పర్యాటక ప్రాంతాలు రద్దీ

... 5వ పేజీ తరువాయి

ఆస్వాదిస్తూ ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం వరకు లంబసింగి పర్యాటక ప్రాంతాలు, యర్రవరం జలపాతం పర్యాటకులతో రద్దీగా కనిపించింది.

కొత్తపల్లి జలపాతం వద్ద..

జి.మాడుగుల: ప్రముఖ పర్యాటక ప్రాంతం కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు సందడి చేశారు. సంక్రాంతి సెలవులు, శనివారం కావడంతో కుటుంబ సమేతంగా జలపాతానికి చేరుకొని రోజంతా సందడిగా గడిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు తరలి రావడంతో ఈ ప్రాంతం కిటకిటలాడింది.



వంజంగి మేఘాల కొండ వద్ద...

పాడేరులో సంక్రాంతి సందడి

- కిటకిటలాడుతున్న వస్త్ర, కిరాణా దుకాణాలు

పాడేరు రూరల్, జనవరి 13: జిల్లా కేంద్రం పాడేరులో సంక్రాంతి సందడి నెలకొంది. పండగ నేపథ్యంలో శనివారం నిత్యావసర వస్తువులు, వస్త్రాల కొనుగోలుకు వివిధ గ్రామాల ప్రజలు తరలిరావడంతో రద్దీ ఏర్పడింది. హుకుంపేట, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పెదబయలు తదితర మండలాలకు చెందిన వివిధ గ్రామాల ప్రజలు పాడేరు చేరుకోవడంతో ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. దీంతో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అలాగే వస్త్ర, కిరాణా, రంగుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలుదారులతో వెనక్కి తగ్గలేదు. భోజన హోటళ్లు రద్దీగా కనిపించాయి.



పాడేరులో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణం

అందరి అభిప్రాయాలు జగన్‌కు వివరిస్తా..

- అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి విషయంలో పార్టీ అధినేత నిర్ణయం తీసుకుంటారు
- ఉత్తరాంధ్ర వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డికి ఇచ్చే వినతిపత్రం ప్రదర్శిస్తున్న వైసీపీ నేతలు.. క్యాడర్‌తో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

అరకులోయ, జనవరి 13: అందరి అభిప్రాయాలను పార్టీ అధినేత జగన్‌కు వివరిస్తానని ఉత్తరాంధ్ర వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపీ మాధవిని ప్రకటించిన నేపథ్యంలో కొంత కాలంగా నియోజకవర్గంలో వ్యతిరేక వర్గం వారు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో పార్టీ సమన్వయ కర్త శనివారం ఇక్కడికి వచ్చేశారు. నియోజకవర్గంలో పర్యటించి నాయకుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం విలేకరులతో సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అందరి అభిప్రాయాలు సేకరించామని చెప్పారు. ఈ నివేదికను జగన్‌కు సమర్పిస్తామని, అభ్యర్థుల విషయంలో అతనే సముచిత నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కాగా, అరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ ప్రకటించిన ఎంపీ మాధవిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో తెలియజేయాలని సుబ్బారెడ్డి సేకరించిన అభిప్రాయాల్లో మొదటి ప్రశ్నగా అడిగారని తెలిసింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ముంచంగిపుట్టు జడ్పీటీసీ సభ్యురాలు సుభద్ర, హుకుంపేట, అరకులోయ జడ్పీటీసీ సభ్యులు రేగం మత్స్యలింగం, రోష్ని, అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అలాగే వారంతా సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పోటీ పరీక్షల్లో విజయానికి పట్టుదల అవసరం

- గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కొండలరావు



గ్రూప్-2 స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న డీడీ కొండలరావు, అప్పలనర్స

పాడేరు రూరల్, జనవరి 13: పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే పట్టుదలతో చదవాల్సిన అవసరం ఉందని గిరిజన సంక్షేమ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు స్పష్టం చేశారు. లోచలిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం గ్రూప్-2 మెటీరియల్‌ను గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో యువత క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. పట్టుదల ఉంటే సాధించడం పెద్ద కష్టమైన విషయం కాదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అవసరమన్నారు. గిరిజన సంఘం చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ గ్రూప్-2 ఉద్యోగాలకు వందలాది మంది ఆదివాసీ యువత దరఖాస్తులు చేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అసాంఘిక కార్యకలాపాల్లో భాగస్వాములై జీవితాలను నాశనం చేసుకుంటుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఉపాధి కోసం గిరిజన ప్రాంతంలో చిన్నతరహా పరిశ్రలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాలకు చెందిన 300 మంది యువతకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, ఉపాధ్యాయ సంఘ నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు, కంబిడి నీలకంఠం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శెట్టి నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రి, మత్స్యరాజు, నరేష్ పాల్గొన్నారు.

పది గంటలైనా తెలవారదే!

... 5వ పేజీ తరువాయి

ప్రాంతాల్లో సైతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ పైబడే నమోదయ్యాయి. అయినప్పటికీ పొగ మంచుగాని, చలిగాలులు గాని ఏమాత్రం తగ్గలేదు. దీంతో మన్యం వాసులు వణుకుతున్నారు.



పాడేరు- విశాఖపట్నం మెయిన్‌రోడ్డులో శనివారం ఉదయం పొగమంచు

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండలంలో చలి తీవ్రత కొనసాగుతోంది. శనివారం ఉదయం 9 గంటల వరకు మంచు కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు వీచాయి. చలి నుంచి ఉపశమనం పొందడానికి ఈ ప్రాంతవాసులు చలి మంటలు వేసుకున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతున్నాయి. దీంతో చలి తీవ్రత తగ్గడం లేదు. శనివారం చింతపల్లిలో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం, సాయంత్రం వేళల్లో శీతలగాలులు అధికంగా వీస్తున్నాయి. చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం పది గంటల వరకు మంచు గిరిజన గ్రామాలను వీడడం లేదు. చలి, మంచు వల్ల ఈ ప్రాంత వాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

వెలుగు ఏపీఎం, ముగ్గురు సీసీలు సస్పెన్షన్

- నకిలీ స్వయం సహాయక సంఘాల పేరుతో బ్యాంకు రుణాలు స్వాహా
- విచారణలో నిర్ధారణ కావడంతో డీఆర్‌డీఏ అధికారులు చర్యలు

అనకాపల్లి రూరల్, జనవరి 13: స్వయం సహాయక సంఘాల పేరుతో నకిలీ గ్రూపులు ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన కేసులో నలుగురు ఉద్యోగులపై డీఆర్‌డీఏ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం, గుండాలవీధి, మరికొన్నిచోట్ల నకిలీ స్వయం సహాయక సంఘాల గ్రూపులు ఏర్పాటు చేసి సుమారు ఎనిమిది కోట్ల రూపాయలను బ్యాంకుల నుంచి రుణాలుగా పొందారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూడడంతో డీఆర్‌డీఏ వెలుగు అధికారులు అప్రమత్తమై విచారణకు ఆదేశించారు. వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులు కుమ్మక్కై రుణాల పేరుతో డబ్బులు స్వాహా చేసినట్టు విచారణలో తేలింది. ఇందుకు బాధ్యులైన సత్యనారాయణపురం సీసీని ఇప్పటికే సస్పెండ్ చేశారు. తాజాగా గుండాలవీధిలో అక్రమాలకు సంబంధించి డీఆర్‌డీఏ వెలుగు అనకాపల్లి కార్యాలయానికి చెందిన ఏపీఎం నీలాచలం, సీసీలు ఎంయూజీఆర్ నాయుడు, కొండబాబు, లక్ష్మీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

☛ సంక్షిప్తంగా..

15న పీఎం జన్‌మన్ ప్రారంభం

18న సామాజిక సమత సంకల్పం

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



పాడేరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అరకులోయ మండలం కొత్తభల్లుగూడ గ్రామంలో ప్రధానమంత్రి జన్‌మన్ యోజనను ఈ నెల 15న ప్రధాని నరేంద్ర మోదీ వర్చ్‌వల్ విధానంలో ప్రారంభోత్సవం చేస్తారని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదిమజాతి గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రత్యేకంగా అమలు చేయాలనే లక్ష్యంతోనే పీఎం జన్‌మన్ యోజనను ప్రవేశ పెడుతున్నట్టు చెప్పారు. ఈ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా కొత్తభల్లుగూడ గ్రామంలోని పలువురు ఆదిమజాతి గిరిజనులతో పీఎం మోదీ వర్చ్‌వల్‌గా మాట్లాడతారన్నారు. అందువల్ల ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

18న సామాజిక సమత సంకల్పం

విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ పురస్కరించుకుని ఈ నెల 18న సామాజిక సమత సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సచివాలయాల పరధిలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలన్నారు. అదే రోజు జిల్లా కేంద్రం పాడేరులో ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించాలన్నారు. అలాగే కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెప్పారు.

మిరియాలు రూ.500పైబడే విక్రయించాలి

మార్కెట్‌లో మిరియాలను కిలో రూ.500లకు తగ్గకుండా విక్రయించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మిరియాలకు మంచి గిరాకీ ఉందని చెప్పారు. గత ఏడాది కిలో రూ.500లకు తగ్గకుండానే మ్యాక్స్ సొసైటీలు కొనుగోలు చేశాయని, ఈ ఏడాది సైతం డిమాండ్ ఉన్నందున రూ.500లకు పైబడి మాత్రమే అమ్ముకోవాలని ఆయన సూచించారు. ఈ విషయంలో గిరిజన రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన చెప్పారు.

కలెక్టర్, పీవో సంక్రాంతి శుభాకాంక్షలు

పాడేరు. జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అధికారులు, అనధికారులు, ప్రజలకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబంతో కలిసి సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. రైతులకు సిరులు, భోగభాగ్యాలు కలగాలని వారు ఆకాంక్షించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముంచంగిపుట్టు, జనవరి 13: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని ఎస్ఐ కె.రవీంద్ర సూచించారు. మండల కేంద్రంలోని శనివారం జరిగిన వారపు సంతలో విస్తృత వాహన తనిఖీలను చేపట్టారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. వాహన డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రైవేటు వాహనాల్లో స్థాయికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, డ్రైవర్లు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వాహనం నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. వాహన ప్రమాదాలు జరగకుండా అందరూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

రా.. కదలిరా సభకు తరలిరండి

ముంచంగిపుట్టు, జనవరి 13: అరకు సమీపంలోని జైపూర్ జంక్షన్ వద్ద ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న రా కదలిరా బహిరంగ సభకు తరలి రావాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి కోరారు. మండల కేంద్రంలో బూత్ ఇన్‌చార్జులతో శనివారం ఆయన సమావేశమై సభకు సంబంధించి జన సమీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మణ్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు ఎం.చిన్ని, బి.రామారావు, గోవింద్, జి.ఈశ్వరరావు, రఘునాథ్, కె.లోకిరామ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందికి ఎంటీఎస్ అమలుచేయాలి

పాడేరు రూరల్, జనవరి 13: గురుకుల కళాశాలల్లో 22 ఏళ్లుగా పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.సుందరరావు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.కొండలరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజుకు 18 గంటలు పనిచేస్తున్న కార్మికులకు పనికి తగిన వేతనం చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంట సమయంలో కార్మికులు అగ్ని ప్రమాదాలకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి 8 గంటల పని అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యాలు, మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టకపోతే ఉద్యమ బాట పట్టి సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నేత బుద్దు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

పాడేరు రూరల్, జనవరి 13: విశాఖపట్నం వేదికగా ఫిబ్రవరి 10, 11వ తేదీలలో జరగనున్న రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముఖి రామకృష్ణ కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం నాయకులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమాజంలో మెరుగైన గుర్తింపు కోసం డీటీఎఫ్ ఎంతగానో కృషి చేస్తున్నదన్నారు. విద్య వ్యాపారీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్నదన్నారు. డీటీఎఫ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విశాఖలో చేపట్టే మహాసభలకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వికాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.దేముడు, కార్యదర్శి బి.మునిస్వామి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సింహాచలం, డీటీఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ధర్మేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు ప్రసాదరావు, జె.సింహాచలం పాల్గొన్నారు.

క్రైం... crime news

కత్తితో అన్నపై దాడి

» మద్యం మత్తులో చెవి నరికేసిన తమ్ముడు

» గదభపాలెంలో ఘటన



తీవ్రంగా గాయపడిన చిన్ని సన్యాసి

కొయ్యూరు, జనవరి 13: మద్యం మత్తులో వివాదం చెలరేగి కత్తితో అన్న చెవిని తమ్ముడు నరికేసిన ఘటన గదభపాలెం గ్రామ సమీప కొండపాకల వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్థులు, మాజీ సర్పంచ్ సూరిబాబు తెలియజేసిన వివరాలు ఇలా వున్నాయి. గదభపాలెం గ్రామానికి చెందిన చిన్ని సన్యాసి, అతని తమ్ముళ్లు ధారకొండ, ఎర్రయ్యలు గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో గల పాటికొండపై రాజులకమ్మకు సమీపంలో పదేళ్ల క్రితం కొండపై చెట్లు నరికి కొండపోడు చేసుకుంటూ అక్కడే నివాసముంటున్నారు. చిన్ని సన్యాసి తాగుడుకు బానిస కావడంతో అతడిని భార్య వదిలేసింది. అతని తమ్ముడు ధారకొండకు భార్య చనిపోయింది. మరో తమ్ముడు ఎర్రయ్యకు వివాహం అయినప్పటికీ అతని భార్య వదిలి వెళ్లిపోయింది. కాగా శుక్రవారం రాత్రి సన్యాసి, అతని ధారకొండ ఇద్దరు పూటుగా మద్యం సేవించి సారా వాటాల్లో తేడాపై వాదనకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ధారకొండ తన అన్న సన్యాసిపై కత్తితో దాడికి చేసి ఎడమ చెవిని నరికేసి పరారయ్యాడు. ఘటన జరిగిన కొండపోడుకు అనుకుని ఉన్న గ్రామానికి చెందిన కవల శ్రీను భూమి ఉండడంతో ఆయన శనివారం ఉదయం అక్కడికి వెళ్లడంతో రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉన్న సన్యాసిని గుర్తించి గ్రామానికి సమాచారం అందించాడు. దీంతో సీహెచ్‌డబ్ల్యూ గొర్లి దేముడమ్మ ఘటన స్థలానికి వెళ్లి మాజీ సర్పంచ్ నీలాపు సూరిబాబు, కొయ్యూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొయ్యూరు ఏఎస్ఐ సింహాచలం గ్రామానికి వెళ్లగా అప్పటికే గ్రామస్థులు క్షతగాత్రుడిని కొండ దించి ఆటోలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 13: మెట్ల మీద నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన మహిళ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. అనకాపల్లి మండలం సత్యనారాయణపురం శివారు మూలపేట గ్రామానికి చెందిన గెద్ద ఇందిర (28) గత నెల 18వ తేదీన మేడపై ఆరబెట్టిన బట్టలను తీసుకుని మెట్లు దిగుతుండగా అదుపు తప్పడంతో గాయపడింది. అయితే సమస్య తీవ్రంగా లేకపోవడంతో ప్రమాదం లేదని కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఈ నెల 11వ తేదీన తలకు నొప్పి రావడంతో స్థానికంగా వైద్య పరీక్షలు చేయించారు. మెదడులో రక్తం గడ్డకట్టినట్టు రిపోర్ట్ రావడంతో డాక్టర్ సలహా మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం ఆపరేషన్ చేశారు. కానీ పరిస్థితి విషమించడంతో కొద్ది గంటల్లోనే మృతిచెందింది. భర్త అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

» ఆరుగురి అరెస్టు

బుచ్చెయ్యపేట, జనవరి 13: పెదమదీనలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.40,800ల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా పేకాట, గుండాట, కోడి పందాలు నిర్వహిస్తే కేసులు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ప్రాణం తీసిన మనస్పర్థలు

» భర్తకు మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చిన భార్య



సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

కశింకోట, జనవరి 13: భార్యాభర్తల మధ్య స్పర్థలు, గొడవలు చివరికి భర్త ప్రాణాలు తీశాయి. మద్యంలో పురుగుల మందు కలిపి భర్తను అంతమొందించిది. బయ్యవరం ఎస్సీ కాలనీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, కశింకోట సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలా వున్నాయి. బయ్యవరం గ్రామానికి చెందిన బరుకు గోవింద(43) ఫార్మాసిటీలోని లారస్ కంపెనీలో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. భార్య శివలక్ష్మి బ్రాండిక్స్‌లో పని చేస్తున్నది. వీరికి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ గొడవ పడుతుండేవారు. గోవిందకు మద్యం సేవించే అలవాటు వుంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం గోవింద నిద్రపోతుండగా శివలక్ష్మి తలగడను అతని ముఖంపై అదిమిపెట్టి చంపడానికి ప్రయత్నించింది. దీంతో అప్రమత్తమైన గోవింద పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి శివలక్ష్మిని మందలించారు. ఇదిలా వుండగా శివలక్ష్మి వ్యక్తిగత అవసరాల కోసం అప్పులు చేసింది. వీటిని తీర్చడానికి గోవింద పేరున వున్న 10 సెంట్ల స్థలాన్ని అమ్మివేయాలని పట్టుబడుతున్నది. కానీ భర్త అంగీకరించకపోవడంతో అతనిని కడతేర్చాలని నిర్ణయించుకుంది. శుక్రవారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలిపి భర్తకు ఇచ్చింది. తెల్లవారుజామున నిద్రలేచిన గోవింద తల్లి వెంకయ్యమ్మ తన కుమారుడి నోట్లో నుంచి నురగలు రావడం, తట్టి లేపినా చలనం లేకపోవడంతో ఆందోళన చెందింది. కోడలు శివలక్ష్మిని నిలదీయగా తనకేమీ తెలియదని చెప్పింది. ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అప్పటికే ప్రాణాలు వదిలాడు. అనంతరం వెంకయ్యమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోడలే తన కుమారుడికి మద్యంలో పురుగుల మందు కలిపి ఇచ్చి హత్య చేసిందని ఆమె ఆరోపించారు. క్లూస్‌టీం రంగ ప్రవేశం చేసి ఆధారాలు సేకరించారు. శివలక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వినోద్‌బాబు తెలిపారు.

పంట కాలువలోకి దూసుకుపోయిన కారు

» ఒకరికి స్వల్ప గాయాలు, క్షేమంగా బయటపడిన మరో ముగ్గురు



పంట కాలువలో ఉన్న కారు

పాయకరావుపేట, జనవరి 13: తాండవ షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒక మహిళకు గాయాలవ్వగా, మరో ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఎస్.సతీశ్ తన భార్య, కుమారుడు, అత్తతో కలిసి సంక్రాంతి పండుగ సందర్భంగా నాతవరం మండలం గునుపూడిలో బంధువుల ఇంటికి కారులో బయలుదేరారు. శనివారం ఉదయం పాయకరావుపేట వద్ద నర్సీపట్నం రోడ్డులో తాండవ షుగర్ ఫ్యాక్టరీ మలుపు వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పింది. ఎదురుగా ఉన్న భూమి ఛానెల్ పంట కాలువలోకి దూసుకుపోయింది. స్థానికులు వెంటనే కాలువలోకి దిగి కారులో ఉన్న వ్యక్తులను బయటకు తీసుకువచ్చారు. సతీశ్ అత్త నూకరత్నంకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	599
విజయనగరం	603
శ్రీకాకుళం	603

ఉద్యోగులను వేధిస్తున్న ప్రభుత్వం

» జీతాలు ఇవ్వకపోవడంతో పండుగ పూట పస్తులుండాల్సిన దుస్థితి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఏలుబడిలో పండుగ పూట కూడా ప్రభుత్వ ఉద్యోగులు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడిన ప్రభుత్వం గతంలో ఏదీ లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి వైసీపీ పాలకులు, ప్రభుత్వ ఉద్యోగులపట్ల కక్షసాధింపు, అహంకారపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని కోరుతున్న ఉద్యోగులను ఉద్దేశించి సకల శాఖల మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి నీచంగా మాట్లాడడం వైసీపీ నేతల పెత్తందారీతనానికి నిదర్శనమని మండిపడ్డారు. 2019 ఎన్నికలకు ముందు జగన్ ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్నప్పుడు.. వైసీపీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే ఎక్కువ జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చే నాలుగున్నరేళ్లు దాటినా అమలు చేయలేదన్నారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీలు 33 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం అంగీకరించకుండా వారిని భయాందోళనకు గురిచేస్తోందన్నారు. ఇంకా సమగ్ర శిక్ష అభియాన్, ఆశ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను సైతం వైసీపీ పాలకులు అమలు చేయడంలేదని అన్నారు. టీడీపీ హయాంలో అన్ని మతస్థుల వారికి ప్రధాన పండుగల సమయంలో నిత్యావసర సరకులను కానుకలు అందజేయగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పండుగ కానుకలను అటకెక్కించిందని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా వున్నారని ఆయన అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, మళ్ల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే మారణాయుధాలతో దాడి

» పెదరాంభద్రపురంలో వ్యక్తి హత్య కేసులో 13 మంది అరెస్టు

» ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడి



మీడియా సమావేశంలో ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా. పక్కన సీఐలు, ఎస్ఐలు

పాయకరావుపేట, జనవరి 13: పాయకరావుపేట మండలంలో పెదరాంభద్రపురంలో గురువారం రాత్రి పథకం ప్రకారం ఒక వర్గం వారిపై మరో వర్గం వారు మరణాయుధాలతో దాడి చేశారని, ఈ సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడని నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శనివారం ఇక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలు.. ఈనెల 11వ తేదీన పెదరాంభద్రపురంలో సీలి నూకరాజు గ్రామంలో అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద కూర్చునే గట్టుమీదకు చెప్పులతో ఎక్కాడు. అక్కడే ఉన్న గంపల నూకరాజు(బుజ్జి) చెప్పులతో ఎక్కకూడదని వారించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి తోసుకున్నారు. అనంతరం ఎవరికివారు ఇళ్లకు వెళ్లిపోయారు.

సీలి నూకరాజు ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పాడు. అందరూ కలిసి గంపల నూకరాజు అంతంచూడాలని నిర్ణయించుకున్నారు. ఇనుప రాడ్లు, కర్రలతో గంపల నూకరాజు ఇంటికి వెళ్లి దాడి చేశారన్నారు. దీంతో నూకరాజు తలకు బలమైన గాయంకావడంతో మృతిచెందాడు. గంపల సత్యనారాయణ, గంపల రమణ, గంపల నాగేశ్వరరావు, కాకాడ సుబ్బారావు, గంపల బాబ్జీ గాయపడ్డారు. మృతుడి సోదరుడు గంపల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి ఒక్క రోజు వ్యవధిలోనే 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీలి సత్తిబాబు, తుమ్మలపల్లి మహేశ్, సీలి అప్పారావు, సీలి రత్నరాజు, సీలి రాజు, సీలి నూకరాజు, సీలి నాగేశ్వరరావు, సీలి వెంకటలక్ష్మి, సీలి నూకరత్నం, సీలి మరియా, సీలి నరేంద్ర, సీలి నూకరాజు, సీలి సూరిబాబులను అరెస్టు చేశారు. మరొక నిందితుడు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితులు దాడికి ఉపయోగించిన మారణాయుధాలు, రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదరాంభద్రపురంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. విలేకరుల సమావేశంలో సీఐలు పి.అప్పలరాజు, పల్లా రమణయ్య, ఎస్ఐలు రమేశ్, జోగారావు పాల్గొన్నారు.

సింహగిరిపై చందన స్వాముల ఆందోళన



ఆందోళన చేస్తున్న చందన స్వాములు

సింహాచలం, జనవరి 13 : ఉమ్మడి విశాఖ జిల్లాలోని చోడవరం, మునగపాక, మన్యం ప్రాంతాలకు చెందిన చందన స్వాములు శుక్రవారం రాత్రి గోపాలపట్నం పెట్రోల్ బంక్ కూడలి నుంచి ర్యాలీగా సింహాచలం చేరుకున్నారు. దేవస్థానం బస్టాండ్‌లోని సింహాద్రి మఠం ఆధ్వర్యంలో జరిగిన నృసింహస్వామి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శనివారం వేకువజామున ప్రభాతారాధనలు ముగించుకుని మాలల విసర్జనకు సింహగిరి చేరుకోగా ఉచితంగా అంతరాలయం ప్రవేశం లేదంటూ అధికారులు అడ్డుకోవడంతో ఆందోళన చేపట్టారు.

ఏటా దీక్షల విరమణకు వచ్చే స్వాములకు ఉచిత రవాణా, అంత రాలయ దర్శనం కల్పించడం ఆనవాయితీ. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా దేవస్థానం అధికారులు అంతరాలయ దర్శనానికి రూ.300 టికెట్లు తీసుకోవాలనడంతో స్వాములు ఆలయ ప్రధాన రాజగోపురం ఎదుట బైఠాయించి ఈఓకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీసం తాము శిరస్సున దాల్చిన తిరుముడులను స్వీకరించేందుకు దేవస్థానం తరఫున ఏర్పాట్లు చేయకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు.

జీతాల కోసం ఆస్పత్రి కార్మికుల ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కె.కోటపాడు, జనవరి 13: వైద్య విధాన పరిషత్ ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.ఎన్.భద్రం డిమాండ్ చేశారు. శనివారం ఆస్పత్రి ఆవరణలో షేక్ మీరా సాహేబ్ అధ్యక్షతన ఏఐటీయూ కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రం మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు అందకపోతే కార్మికులు పండగ ఏవిధంగా జరుపుకుంటారన్నారు. 549 జీవో ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వేచలపు కాసుబాబు, దేముడుబాబు, జనార్దన్, నాగరత్నం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నావికాదళాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



తూర్పునావిదళ అధికారులతో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

విశాఖపట్నం, జనవరి 13 : ముస్సోరి ఎల్‌బీఎస్ ఎన్‌ఏఏకు చెందిన 19 మంది ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శుక్రవారం తూర్పు నావికాదళాన్ని సందర్శించింది. తూర్పు నావికాదళ ప్రధాన కార్యాలయ అధికారులు వారికి నేవీ పనితీరు, దేశ రక్షణలో ఇండియన్ నేవీ పాత్ర గురించి వివరించారు. అలాగే నేవీ ఉపయోగించే ఆయుధాలు చూపించి వాటి పనితీరును వివరించారు. నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగా నుంచి ఎయిర్ వింగ్ ఆపరేషన్ విధానాన్ని తెలిపారు. అనంతరం ఐఎన్ఎస్ రన్‌విజయ్ యుద్ధ నౌకను సందర్శించే అవకాశం కల్పించారు. నౌకపై ఉన్న ఆయుధాలు, సెన్సార్‌లు శత్రువులను ఎదుర్కొనే విధానం వివరించారు. కమెండర్ సంతాన ఝా వారితో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలను తెలిపారు.

జనారణ్యంలోకి దుప్పి



చెట్టు కింద సేద తీరుతున్న దుప్పి

విశాఖపట్నం, జనవరి 13 : అటవీ ప్రాంతంలో ఆహారం లభించకపోవడంతో పలు జంతువులు జనారణ్యంలోకి వస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం జూపార్కు ప్రాంతంలోని సీతకొండ నుంచి విశాలాక్షినగర్ కాలనీలోని ప్రధాన రహదారిపైకి ఓ దుప్పి వచ్చింది. దీనికి అటుగా వెళ్లేవారు ఫొటోలు, వీడియోలు తీస్తూ హడావిడి చేశారు. వన్య ప్రాణులు కాలనీల్లోకి రాకుండా అటవీ శాఖాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

19 నుంచి పలు రైళ్లు రద్దు.. గమ్యం కుదింపు

విశాఖపట్నం, జనవరి 13: వాల్తేరు డివిజన్ పరిధిలోని సింగపూర్‌రోడ్డు- రాయగడ సెక్షన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు చేపడుతున్నందున ఈనెల 19వతేదీ నుంచి పలు రైళ్లను రద్దు చేయగా, కొన్ని రైళ్ల గమ్యాలను కుదించడంతోపాటు రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలివి..

ఈనెల 19వతేదీ నుంచి 27 వరకు విశాఖ-రాయపూర్ ప్రత్యేక పాసింజర్ రైలు (08528), విశాఖ-భవానిపట్న ప్రత్యేక పాసింజర్ (08504), విశాఖ-కోరాపుట్ ప్రత్యేక పాసింజర్ (08546) రద్దు చేశారు. ఈనెల 20వతేదీ నుంచి 28 వరకు రాయపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08527), భవానిపట్న-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08503), కోరాపుట్-విశాఖ ప్రత్యేక పాసింజర్ (08545) రద్దయ్యాయి.

రీ షెడ్యూల్...

ఈనెల 19, 22, 26 తేదీల్లో విశాఖ-కోరాపుట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18512); ఈనెల 20, 23, 27 తేదీల్లో కోరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18511); ఈనెల 18, 21, 25 తేదీల్లో తిరుపతి-బిలాస్‌పూర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17482), ఈనెల 20, 23, 27తేదీల్లో బిలాస్‌పూర్-తిరుపతి బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17481) రద్దు చేసినట్టు డీసీఎం పేర్కొన్నారు. ఈనెల 19, 20తేదీల్లో గుంటూరులో బయలుదేరి రాయగడ వచ్చే 17243 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలును విజయనగరం వరకు, తిరుగు ప్రయాణంలో రాయగడ నుంచి గుంటూరు వెళ్లాల్సిన 17244 నంబరు గల రైలు ఈనెల 20, 27న విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరు చేరనుంది. విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847) ఈనెల 21వతేదీన విశాఖలో ఐదు గంటలు ఆలస్యంగా, ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22848) ఈనెల 23వతేదీన ఎల్‌టీటీ నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడుపుతూ రీషెడ్యూలు చేశారు. అలాగే, విశాఖ-భగత్‌కికోటి ఎక్స్‌ప్రెస్ (18573) ఈనెల 25న విశాఖలో ఎనిమిది గంట లు ఆలస్యంగా బయలుదేరనుంది. అలాగే సంబల్‌పూర్-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20810) ఈనెల 20, 22, 23, 27తేదీల్లో సంబల్‌పూర్‌లో నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు.

సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గం



ఉత్తర సర్కార్ బాప్టిస్టు చర్చి సంఘాల నూతన కార్యవర్గం

పాయకరావుపేట, జనవరి 13: ఉత్తర సర్కార్ బాప్టిస్టు చర్చి సంఘాల (సీబీసీఎన్‌సీ) నూతన కార్యవర్గం ఎన్నికలు శనివారం స్థానిక కల్వరి బాప్టిస్టు చర్చిలో జరిగాయి. సీబీసీఎన్‌సీ 69వ మహాసభ, సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి.ఐజాక్(విశాఖపట్నం), ఉపాధ్యక్షురాలిగా కె.సుభద్ర(కాకినాడ), కార్యదర్శిగా ఏడీకే.జాన్(తుని), రికార్డింగ్ కార్యదర్శిగా ఎస్ఆర్.కుమార్(నర్సీపట్నం), కోశాధికారిగా జి.ఎలీషా(పిఠాపురం), ట్రస్ట్ అసోసియేషన్ ఛైర్మన్‌గా వై.కృష్ణమూర్తి(విశాఖపట్నం), ట్రస్ట్ కార్యదర్శిగా ఎ.జోషీపాల్(తుని), సభ్యునిగా పల్లా విలియంకేరి(పాయకరావుపేట) ఎన్నికయ్యారు.

పుణ్యకోటి వాహనంపై ఊరేగిన స్వామివారు



స్వామివారి తిరువీధి సేవ



పుణ్యకోటి వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 13: మండలంలోని ఉపమాకలో శనివారం మధ్యాహ్నం పుణ్యకోటి వాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరిగింది. అంతకుముందు ఆలయానికి ఆనుకుని వున్న పూదోటకు గోదాదేవి అమ్మవారిని తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. అనంతరం పుణ్యకోటిపై ఉభయదేవేరులతో స్వామివారిని, రాజాధిరాజ వాహనంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి వీధుల్లో ఊరేగించారు.

సింహాద్రి మొదటి యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, జనవరి 13: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని శుక్రవారం అర్ధరాత్రి పునరుద్ధరించారు. ఈ యూనిట్‌లో శుక్రవారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తడంతో ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు రంగంలోకి మరమ్మతు పనులు చేపట్టారు. కొద్ది గంటల్లోనే విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని యూనిట్‌ల్లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతున్నదని అధికారులు వెల్లడించారు.

రేపటి స్పందన రద్దు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 13: కలెక్టరేట్‌లో ఈ నెల 15వ తేదీన నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు డీఆర్వో బి.దయానిధి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

పుంజుకున్న ధరలు

» నర్సీపట్నం కోళ్ల సంతలో పండగ శోభ

» చవల జాతి కోడి పుంజు ధర రూ.10 వేలు



నర్సీపట్నంలో నాటు కోళ్ల మార్కెట్

నర్సీపట్నం, జనవరి 13 : సంక్రాంతి పండగ అంటే పందెం కోళ్ల కు ఎంతటి గిరాకీ ఉంటుందో అందరికీ తెలిసిందే. స్థానిక నూకాలమ్మ గుడి సమీపంలోని నాటు కోళ్ల సంతలో పండగ సందడి కనిపించింది. ప్రతీ శనివారం నర్సీపట్నం చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు నాటు కోళ్ల తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తారు. సంక్రాంతి పండగ అంటేనే కోడి పందాలకు ఎంతటి ప్రసిద్ధో అందరికీ తెలిసిందే. నర్సీపట్నం చుట్ట పక్కల గ్రామాలలో కోడి పెందెములు గట్టిగానే జరుగుతాయి. దీంతో శనివారం పందెం కోళ్ల కోసం జనం ఎగబడ్డారు. ఒక్కొక్క కోడి పుంజు రూ.3వేలు నుంచి రూ.10 వేలు వరకు విక్రయించారు. చవల రకం జాతికి చెందిన పందెం కోడి ధర రూ.10వేలు పలికింది. అదే విధంగా మరో అబ్బర్స్ జాతి కోడి పుంజు రూ.5500లకు విక్రయించారు.



చవల జాతి పందెం కోడి పుంజు



అబ్బర్స్ జాతి పందెం కోడి